డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

జూబ్లీహిల్స్ యూపీహెచ్సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జె. వెంకటి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: జూబ్లీ హిల్స్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ను శనివారం హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె. వెంకటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను పరిశీలించడంతోపాటు గర్భిణుల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. దవాఖానకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహరి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్నగర్ డివిజన్లో శ్రీరామ్నగర్ యూపీహెచ్సీని సైతం డీఎంహెచ్ఓ సందర్శించి సేవలను, రికార్డులను పరిశీలించారు. డాక్టర్ బి. విజయనిర్మల ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశ్రిత ఈనెల 10న నిర్వహించనున్న నేషనల్ డీ వార్మింగ్ డే ఏర్పాట్లను డీఎంహెచ్ఓకు వివరించారు.

రేపు చలో హైదరాబాద్

కందుకూరు,ఫిబ్రవరి 8 కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్లు మండల సీపీఎం,సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాలరాజ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు మధ్యాహ్న భోజన కార్మికులు ఆశ వర్కర్లు, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కనీసం ఉద్యోగ భద్రత కల్పించి నెలకు కనీసం రూ. 26 వేల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి విడనాడాలని కోరారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు

పైసా చెల్లించకుండా.. జోరుగా హోర్డింగులు

- శంషాబాద్లో అక్రమంగా ఏర్పాటు
- ఏడాదిగా రెండు కోట్ల మున్సిపల్ ఆదాయానికి గండి
- అక్రమంగా వెలసినవి కొన్నే అంటూ హైడ్రా కూల్చివేతలు
- రెన్యూవల్ కానీ వాటి సంగతేంటి?

శంషాబాద్ ఔటర్ రింగురోడ్డు పక్కన వెలసిన అక్రమ హోర్డింగులు

మణికొండ, ఫిబ్రవరి 8 : ఎవరికి వారు.. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా హోర్డింగుల ఏర్పాటు చేస్తుండటంతో సర్కారు ఖజానాకు కోట్లాది రూపాయల గండి పడుతున్నది. నిబంధనల ప్రకారం సంబంధితశాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నా అవేమీ పట్టనట్లుగా హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇందుకు ఆయా శాఖల అధికారులు సైతం కొమ్ము కాస్తుండటంతో 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్లుగా సాగుతున్నది.

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గత ఏడాది కాలంగా పుట్టగొడుగుల్లా హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఏ ఒక్క హోర్డింగు సంస్థకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. కానీ సంబంధిత మున్సిపాలిటీ అధికారులతో లోపాయికారి ఒప్పందాలను చేసుకుంటున్నట్లు విమర్శలున్నాయి. తద్వారా మున్సిపాలిటీకి రావాల్సిన కోట్ల రూపాయలు అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఏడాది కాలంగా మిగిలిన హోర్డింగుల అనుమతులను రెన్యూవల్ చేయకుండానే కొనసాగిస్తుండటం వెనుక అంతర్యరమేమిటని స్థానికంగా చర్చసాగుతున్నది. ప్రధానంగా కొన్ని హోర్డింగు సంస్థలు సర్కారు ఖజానాను బహిరంగంగానే దోచుకుంటున్నాయి. వాటికి ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు వెనుకుండి నడిపిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

గతంలోనే హోర్డింగులను తొలగించాలని ఆదేశాలు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగ్రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి హోర్డింగులను ఏర్పాటు చేయవద్దంటూ అప్పటి మున్సిపల్శాఖ స్పష్టమైన ఆదేశాలతో కూడిన జీవోను జారీచేశారు. కానీ ప్రస్తుతం అవేమీ పట్టనట్లు స్థానిక అధికారులు బేఖాతారు చేయడంతో విచ్చలవిడిగా హోర్డింగులు వెలిశాయి. అక్రమంగా హోర్డింగులను ఏర్పాటు చేసుకున్న కొందరు అంతర్గత వివాదాలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ను కలిసి ఫిర్యాదులు చేయడం గమనార్హం. ఇందుకు స్పందించిన హైడ్రా కమిషనర్ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని హోర్డింగులున్నాయి. ఎన్నింటికి అనుమతులున్నాయంటూ ఆరా తీశారు. మొత్తం 140 హోర్డింగులుండగా వాటిలో కేవలం పదింటికి మాత్రమే అనుమతులు లేవని మిగతావన్నీ గతంలో అనుమతులు పొందినవేనంటూ అధికారులు తేల్చిచెప్పారు. కానీ వెలసిన అన్నింటికీ అనుమతులు ఇచ్చిన గడువు పూర్తయి ఏడాది గడిచింది. అవి ఇప్పటికీ రెన్యూవల్ కాలేదు. అలాంటప్పుడు ఆ హోర్డింగులు ఏవిధంగా సక్రమమో అధికారులే చెప్పాలి. ఏడాది కాలంగా రూపాయి రుసుము చెల్లించకుండా దాదాపు రూ. రెండు కోట్ల వరకు ఏడాదిలో మున్సిపాలిటీ చెల్లించాల్సి ఉన్నా అవేమి పట్టనట్లుగా హోర్డింగుల నిర్వాహకులు సర్కారు ఖజానాకు గండికొడుతున్నారు. వీటిపై కూడా హైడ్రా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి హోర్డింగులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.రెండు కోట్ల ఆదాయానికి గండి

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా వెలసిన హోర్డింగుల తొలగింపు ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాలిటీ పరిధిలో 140 హోర్డింగులు వెలిశాయి. హెచ్ఆర్డీసీ పరిధికి చెందిన ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా 17హోర్డింగులు ఏర్పాటు చేశారు. వాటిని పూర్తిగా తొలగించేందుకు హైడ్రా రంగంలోకి దిగింది. వీటిలో ఇప్పటికే కొంతమంది తమ హోర్డింగులను స్వచ్ఛంధంగా తొలగించుకుంటున్నారు. ఎయిర్పోర్టు రోడ్డు సాతంరాయి నుంచి ఎయిర్పోర్టు ప్రధాన

రహదారి వరకు 17 హోర్డింగులున్నాయి. మిగిలిన 123లో మరో పది హోర్డింగులకు అనుమతులు లేవని అధికారులు తేల్చారు. ఇంకా 113 హోర్డింగులను కొత్త పాలసీ ప్రకారం రెన్యూవల్ చేస్తారా? లేక వాటిని తొలగిస్తారా? అన్నది సంధిగ్ధంలో ఉన్నది. వీటి ద్వారా ప్రతియేటా మున్సిపాలిటీ సుమారు రూ. రెండు కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని తెలుస్తున్నది.

కొనసాగుతున్న ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్

జూబ్లీహిల్స్లో స్పెషల్ డ్రైవ్ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: అనధికారిక సైరన్లు, కారు అద్దాలకు బ్లాక్ స్టిక్కర్లను తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ వెస్ట్జోన్ పరిధిలో కొనసాగుతున్నది. బంజారాహిల్స్ , జూబ్లీహిల్స్ ఫిలింనగర్, పంజాగుట్ట ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమతి లేకుండా సైరన్లు వేసుకున్న వారికి జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. అదేవిధంగా కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం వేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ను శనివారం వెస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పరిశీలించారు.

రేపు నట్టల నివారణ మందుల పంపిణీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: పిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా ఉండేందుకు నట్టల నివారణ మందులు విధిగా వేయించాలని గోల్కొండ ఎస్పీహెచ్ఓ డాక్టర్ మురళీధర్ పేర్కొన్నారు. ఈనెల 10న నిర్వహించనున్న నేషనల్ డీ వార్మింగ్ డే వైద్య శిబిరాలపై శనివారం షేక్పేట్ ప్రభుత్వ పాఠశాలలో వైద్య సిబ్బంది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఎన్డీడీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ.. 10న అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో అంగన్వాడీల్లో చిన్నారులు, విద్యార్థులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఒకటి నుంచి 18 ఏండ్ల పిల్లలకు విద్యార్థులకు నట్టల నివారణ మందులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ శామ్యూల్రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి నైమిషారణ్య పరిక్రమణ మహోత్సవం

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న అనిల్కుమార్శాస్త్రి తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8 : ఉత్తర్ప్రదేశ్ రాష్ట్రం సీతాపూర్లో మార్చి 1 నుంచి 13 వరకు నైమిషారణ్య పరిక్రమణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ వ్యాస పీఠాధీషులు శ్రీశ్రీశ్రీ అనిల్ కుమార్శాస్త్రి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్క్లబ్లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సత్య యుగంలో ప్రజా శ్రేయస్సు, లోక కళ్యాణం కోసం తన శరీరాన్ని దానం చేసిన దధీచి మహర్షి 88 వేల మంది ఋషులకు, 33 కోట్ల మంది దేవతలకు ప్రదక్షిణ చేశారని, అదే సంప్రదాయంగా పుణ్యప్రాప్తి కోసం ఈ నైమిషారణ్య పరక్రమణ క్రతువు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పరిక్రమణ (ప్రదక్షిణ) చేసుకునేందుకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం బ్రోచర్లను ఆవిష్కరించారు. సమావేశంలో కార్యక్రమ కన్వీనర్ రంజిత్కుమార్ దీక్షిత్, కర్ణాటక మాణికేశ్వరి మాతాజీ శిష్యులు వీర ధర్మేంద్ర స్వామి, వేద వ్యాస పీఠం అధికార ప్రతినిధి కృష్ణవేణి శర గోపన్ పాల్గొన్నారు.

కృష్ణకాంత్ పార్కును సందర్శించిన జోనల్ కమిషనర్

యూసుఫ్గూడ కృష్ణకాంత్ పార్కులో మాలిక వసతులపై నిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న జడ్సీ ఉపేందర్రెడ్డి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: పార్కుల్లో సందర్శకులకు, వాకర్స్కు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్రెడ్డి సూచించారు. శనివారం యూసుఫ్ గూడ కృష్ణకాంత్ పార్కును జడ్సీ సందర్శించి ఇటీవల ఆధునీకరించిన టాయిలెట్ బ్లాక్ను పరిశీలించారు. అనంతరం జడ్సీ మాట్లాడుతూ.. పార్కుల్లో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయాలని.. సరైన సౌకర్యాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించాలన్నారు. కృష్ణకాంత్ పార్కులో మరొక బ్లాక్ టాయిలెట్ల ఆధునీకరణ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకీయా సుల్తానా, ఈఈ రాజ్కుమార్, యూబీడీ మేనేజర్ ఎస్.విక్రమ్చంద్ర, యూసీడీపీఓ వెంకటకిషన్రావు, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఈఈ మల్లిఖార్జున్, ఎస్ఎస్ విజయ్కుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

జాగృతి డిగ్రీ కాలేజీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐ.శేఖర్

హిమాయత్నగర్, ఫిబ్రవరి 8: పోటీ ప్రపంచంలో విద్యార్థులు పట్టుదలతో చదివి విజ్ఞానాన్ని పెంచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఓయూ కాలేజీ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఐ. శేఖర్, జాగృతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఓఎస్ రెడ్డి సూచించారు. శనివారం నారాయణగూడలోని జాగృతి డిగ్రీ కాలేజీలో రీసెర్చ్ మెథడాలజీ ప్రాజెక్టు రూపకల్పనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.ప్రాజెక్టు ప్రాధాన్యం, నైపుణ్యాల అభివృద్ధి, మేనేజ్మెంట్లో ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాగృతి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జోసెఫిన్రెడ్డి, శశికిరణ్రెడ్డి, నీతారెడ్డి, కామర్స్ విభాగం హెడ్ మధుసూదన్, బీబీఏ హెడ్ మేఘాచందన, అరవింద్, రాగిణి, శ్రీనివాస్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖయ్యూంనగర్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరిశంకర్

మైలార్దేవ్పల్లి, ఫిబ్రవరి 8: ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరిశంకర్ అన్నారు. డివిజన్లోని ఖయ్యూంనగర్లో రూ. 20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా అభివృద్ధి పనులను చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్,వెంకట్రెడ్డి, విజయ్, స్వామి, శ్రీనివాస్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

టీవీఎస్పై కుంభమేళాకు వృద్ధుడు

రామంతాపూర్,ఫిబ్రవరి 8: రామంతాపూర్ సత్యనగర్కు చెందిన 80 సంవత్సరాల వృద్ధుడు గీతకార్మికుడు మిట్టపల్లి రాములు శనివారం రామంతాపూర్ నుంచి టీవీఎస్ మోపైడ్పై కుంభమేళాకు బయలుదేరాడు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సర్వబాబు యాదవ్ మల్లికార్జున్స్వామి ఆలయం నుంచి జెండా ఊపి అతని యాత్రను ప్రారంభించారు.

భక్తిభావనతోనే మానసిక ప్రశాంతత

హనుమాన్ దేవాలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్రెడ్డి

మైలార్దేవ్పల్లి, ఫిబ్రవరి 8: భక్తిభావనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మైలార్దేవ్పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఎల్వీ రెడ్డి, టి.చిన్న, ఎన్.శంకర్రెడ్డి, గోవింద్రాజ్, వినయ్, వెంకటేశ్, ఉత్తమ్, ఉదయ్, రాజావర్ధన్రెడ్డి, కిశోర్, శివాజీ, వల్లభ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి అగ్నిప్రమాదం

హిమాయత్నగర్, ఫిబ్రవరి8: ప్రమాదవశాత్తు వీధి దీపాలు, లేజర్ లైట్స్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన నారాయణగూడ పోలీస్స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం ఎస్ఎస్ తిరుపతినాయక్, ఎస్ఎఫ్ఏలు సోమయ్య, శ్రీనివాస్ గమనించి నారాయణగూడ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమిచ్చి కరెంట్ సరఫరాను నిలిపి వేయించడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కరెంటు తీగలు ఒకదానికి మరొకటి తగలడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపకశాఖ సిబ్బంది భావిస్తున్నారు. నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

కాంగ్రెస్ సర్కార్ పాలనపై దృష్టి పెట్టాలి

కందుకూరు. ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం డ్రామాలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ కార్యదర్శి మల్లారెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. సర్పంచ్ల పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదని ఎంతోమంది ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. గ్యారంటీల విషయంలో పట్టించుకోవడంలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో రావడానికి మోసపూరితమైన వాగ్దానాలు చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని చెప్పి తిరిగి ప్రజలను మోసం చేయాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రానట్లయితే ప్రజలు ఛీ కొడుతారని హెచ్చరించారు.

కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానం స్ఫూర్తిదాయకం..

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ప్రొ. హరగోపాల్, కే. శ్రీనివాస్ తదితరులు

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 8: చారిత్రక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, సకల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక ఉద్యమాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించినది భారత కమ్యూనిస్టు ఉద్యమమని పలువురు వక్తలు పేర్కొన్నారు.. స్వాతంత్ర సమరయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి రచించిన 'భారత కమ్యూనిస్టు పార్టీ.. వందేళ్ల ఉద్యమం, ప్రస్థానం, విప్లవాల విప్లవం' అనే రెండు గ్రంథాల ఆవిష్కరణ శనివారం సాయంత్రం నారాయణగూడలోని తాజ్మహల్ హోటల్ జరిగింది. ప్రముఖ కవి నిఖిలేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మానవ హక్కుల కార్యకర్త, రిటైర్డ్ ప్రొఫెసర్ జి. హరగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడిత ప్రజల పక్షాన నిర్విరా మంగా పోరాడుతూ 100 ఏండ్లు పూర్తి చేసుకున్న కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు. నేటి తరానికి ప్రజాస్వామిక విలువలు, లౌకిక సాంప్రదాయ ఆవశ్యకతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్ర జ్యోతి మాజీ సంపాదకుడు డాక్టర్ కే. శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుని ప్రజల హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి,రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, కలవేణి శంకర్, మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, ప్రముఖ కవి ఏటుకూరి ప్రసాద్, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ప్రతినిధి నరహరి పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన

ఉప్పల్ ఫిబ్రవరి 8: ఉప్పల్ శిల్పారామంలో శనివారం అభినయ కూచిపూడి కళాక్షేత్రం గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్య బృందం చే కూచిపూడి నాట్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. రంగపూజ, శ్రీ గణపతిమ్, విన్నపాలు, నమశ్శివా య, జతిస్వరం, ఇదిగో భద్రాద్రి, దశావతర శబ్దం, మొదలైన అంశాలను ప్రదర్శించారు. శ్రీదేవి, అలేఖ్య రెడ్డి, జెస్సికా, కైవల్య, సుదీక్ష, నమ్రత, మహతి,నక్షత్ర, స్నిగ్ధ, సాయి కృతిక, హంసిని, అనేక, హోషిక, జోషిక, షాలిని, నిశిత తమ ప్రదర్శనతో మెప్పించారు.

ఘనంగా ఎన్సీసీ సిల్వర్జూబ్లీ ఉత్సవాలు

ఉత్తమ క్యాడెట్లను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈఓ శామ్యూల్రాజ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8 : యూసుఫ్గూడ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎన్సీసీ సిల్వర్జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గత 25 ఏండ్లుగా ఎన్సీసీ శిక్షణ నిర్వహిస్తూ విద్యార్థులను ఉన్నతస్థానాలలో నిలబెట్టేందుకు ఉపాధ్యాయులు విశేషంగా కృషి చేశారని డిప్యూటీ డీఈఓ శామ్యూల్రాజ్ కొనియాడారు. ఈ సందర్భంగా గత 25 ఏండ్లుగా ఎన్సీసీ శిక్షణాధికారిగా సేవలందిస్తున్న పి.ప్రభాకర్ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాల నుంచి ఆలిండియా షూటింగ్ పోటీల్లో పాల్గొన్న అద్నామ్ సమీ, వెంకటసాయి, తదితర ఉత్తమ క్యాడెట్లకు బహుమతులు అందజేశారు. భవిష్యత్లో మరింత రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ, పీఆర్టీయూ ప్రెసిడెంట్ మధుసూదన్రెడ్డి, ఎస్టీయూ నాయకులు మహ్మద్ అలీ, యూటీఎఫ్ నాయకులు నాగరాజ్, అనంతలక్ష్మి, హన్మంతరావు, పీడీలు విశ్వేశ్వర్రావు, మద్దిస్వర్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సదుపాయాల లకల్పనకు ముందుకు రావాలి



రాముయాదవ్ సహకారంతో నేతాజీనగర్ పాఠశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ క్లాసులు

మైలార్దేవ్పల్లి, ఫిబ్రవరి 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్రెడ్డి కోరారు. పద్మశాలిపురానికి చెందిన రాము యాదవ్ నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ క్లాస్ల నిర్వహణకు ఉచిత ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రాముయాదవ్ను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత ముందుకు వస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వర్, లక్ష్మి, మమత, యాదమ్మ, నవయువ యూత్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయ ఆవరణలో అగ్నిప్రమాదం

మంటల్లో కాలిపోయిన సామగ్రి

బండ్లగూడ,జనవరి 8: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు కార్యాయలంలో శుక్రవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. దాంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే స్థానిక నాయకుడు ప్రేమ్గౌడ్కు సమాచారం అందించడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సిబ్బంది ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. కాగా వార్డు కార్యాలయం చుట్టూ కూరగాయాల మార్కెట్ ఉందని అక్కడ శుక్రవారం ఎవరైనా సిగరెట్ తాగి పడవేసి ఉండటంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో వార్డు కార్యాలయంలో పెద్ద ఎత్తు సామగ్రి కాలిపోయినట్లు సిబ్బంది పేర్కొంటున్నారు.

ఆస్తిపన్ను వసూలు చేయండి

కాప్రా, ఫిబ్రవరి 8: కాప్రా సర్కిల్లో ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని సర్కిల్ డిప్యూటీకమిషనర్ సూచించారు. సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగానికి చెందిన బిల్కలెక్టర్లు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, వాల్య